# ప్రేమలేఖల పర్యవసానం

సుబ్బారాయుడ్ని ఒక రచయితగా పత్రికలవాళ్ళు అసలు గుర్తించనే గుర్తించలేదు. అయితే పత్రికలవాళ్ళు అట్టే గుర్తించకపోయినా ఆ వీధిలోనూ, మిత్రుల దగ్గరా, కాస్త వయసులోకొస్తున్న చదువుకొనే పిల్లల దగ్గరా మంచి రచయితగా చలామణీ అయిపోయాడు. అందుకు కారణం-అతను వరసగా బి.ఏ నాలుగుసార్లు పరీక్షకు కూర్చోవడమే! బి.ఏ. లోకి రాగానే కథలు వ్రాయడం ప్రారంభించాడు. కారణం-క్లాసులో అతనికి తెలిసిన ఓ అమ్మాయికథలు తరచు పత్రికల్లో అచ్చవుతున్నాయి గనక.

'కథా రచనకు ముందు తెలుగులో వున్న పెద్దపెద్ద పుస్తకాల్నీ, చిన్నాపెద్దా కథల్నీ క్షుణ్ణంగా చదవాలి. వీలయితే ఎందులోనన్నా ఓ ముక్క వప్పగించి, ఫలానా వాడన్నాడని చెప్పేటట్టుగా దాన్ని గుండచేసి, మరికాస్త పిండిచేసి, పానకంలా మంచినీళ్ళలో కలిపి, లేదా కషాయంలా వేడినీళ్ళలో వేసి రసందింపి, గడగడా తాగేయాలి. అలాచేస్తే అది బుర్రలో ఎప్పటికీ అలావుండిపోతుంది'-అని సుబ్బారాయుడి అభిప్రాయం.

అయితే యిదంతా అతను అదృష్టంకోద్దో, లేక దురదృష్టంకొద్దో (జనం అంటున్నారుగామరి!) మూడేళ్ళకిందటే అమలుజరిపి కథా పఠనానికి శ్రీకారంచుట్టాడు. అది అవిచ్ఛిన్నంగా అప్పటినుండీ సాగుతూవచ్చింది. ఇక చేయవలసినపనల్లా-కూర్చుని

కథలు రాయడానికి పూనుకోవడమే.

ఒక మంచి ముహూర్తం చూసి సుబ్బారాయుడు అదీ ప్రారంభించాడు. వరసగా మూడు నెలల్లో ఓ డజనున్నర కథల్ని తయారుచేశాడు. కాని పత్రికలకు పంపిస్తే మరోమూడు నాలుగు నెలలకు, వెళ్ళినవన్నీ వరసాగ్గా తిరిగి వచ్చాయి. కారణం ఏమిటో అతనికి బోధపడలేదు. ఓరోజున మిత్రుడిముందు మనసులోని కోపాన్ని కక్కేస్తూ "ఒట్టి పార్షాలిటీ సుమీ' అన్నాడు.

నిజానికి పత్రికలవాళ్ళు అతనిమీద పక్షపాత బుద్ధితో నిరాదరణ చూపిస్తున్నారేమో గాని అతని కథలు చదివిన మిత్రులు 'భలేరా' అని భుజం చరిచేవారు. ఆ సమయంలో సుబ్బారాయుడు ఆ వీధిలోని కిళ్ళీకొట్టుదగ్గర్నుంచి సిగరెట్లు తెప్పించి టేబిలుచుట్టూ కూర్చున్న మిత్రులకు తలా ఒక సిగరెట్టిచ్చి 'మరేమనుకున్నారు!' అన్నట్టుగా ఫోజుపెట్టి ఓమారు శరీరాన్నంతటినీ గాలితో నిండుగా నింపుకునేవాడు.

సుబ్బారాయుడు అలా గట్టిగా గాలి పీల్చాడంటే ఏదో విశేషమైన విషయమే చెప్పబోతున్నాడని మిత్రులందరికీ అర్థమౌతుంది. అప్పుడు అంతా నిశ్శబ్దంగా వెనక్కు కుర్చీలకు జారబడి సిగరెట్లు కాలుస్తూ పొగను ముందుకు వదుల్తూ సుబ్బారాయుడివైపు చూస్తారు. సుబ్బారాయుడు అందరికీ అనుకూలంగా టేబిలుమీదకు వంగి, సగం కాలిపోయిన సిగరెట్టును అలావేళ్ళమధ్య గాలికివొదిలి మెల్లగా చెప్పడం ప్రారంభిస్తాడు.

"ఇప్పుడు చదివిన కథ ఓ వార పత్రిక్కి పంపిస్తున్నాను. ఈ దెబ్బతో వాడు డంగైపోయి అభినందిస్తూ ఉత్తరం రాయాలి. బహుశా మొట్టమొదటి కథగా దీన్నే వేస్తాడనుకుంటా. దీంతో మనపేరు పాఠకలోకంలో తళుక్కుమంటుంది. అంతలోకే మరోటి ... ఆ తర్వాత యింకోటి- అలా సంవత్సరం తిరగ్గానే మనల్ని చేయితిరిగిన రచయితగా వాళ్ళే వప్పుకుంటారు. రాయడానికి అప్పుడు ఓపిక వుండాలేగాని వేసుకొనే వాళ్ళు బోలెడుమంది" ఓక్షణం ఆగి మిత్రుల ముఖాల్లోకి చూస్తాడు. ఆ ముఖాల్లో 'అవును నిజమే' అన్న భావం కనిపిస్తుంది. ఆ వెంటనే మళ్ళీ మొదలెడతాడు-

"ఈ పత్రికా కార్యాలయాల్లో వెధవలవాటు ఒకటుంది. ఆ సబెడిటర్స్ వుంటారు చూశారూ-వాళ్ళకు మహా బద్ధకం. తమ జీతం తమకి ఎలాగూ ముడుతుందికదాని పంపిన కథల్ని పూర్తిగా చదవనన్నా చదవరు. పూర్తిగా చదివితే వాళ్ళ సొమ్మేంపోయిందో! మొన్న తిరిగొచ్చిన కథ చూడండి. అందులో ఆ రెండో పేజీనుండి కథ ఎంత పటుత్వంగా నడిచిందో! కథ చదువకుండానే తిప్పి పంపేశారు. పోనీ అంతకుముందు తిరిగొచ్చినకథ-

అదీ అంతే"

సుబ్బారాయుడు చెప్పడంపూర్తికాగానే మిత్రులంతా ఒకరితర్వాత ఒకరు తమ అభిప్రాయాల్ని అప్పగిస్తారు.

"వెయ్యకేంచేస్తాడు?"

"ఈసారి తప్పకుండా పడితీరుతుంది."

"ఇంతకన్నా మంచికథలు వస్తున్నాయేం వెయ్యకపోవడానికి"

"రాయుడు రాస్తే తిరిగి పంపెయ్యడమంటూ వుంటుందా."

ఆ మాటలు వింటూ చిన్న చిరునవ్వు అందరికీ కలిపి ఒకటి విసిరి, సిగరెట్టు ఓదమ్ములాగుదామని వేళ్ళ మధ్యకు చూసుకొనేసరికి, సిగరెట్టు కొసవరకూ తగలబడి యింకొంచెం సేపుంటే వేలికి చురకేసేటందుకు సిద్ధమైనట్టు కనిపిస్తుంది.

దాన్ని అవతలకు విసిరి వాళ్ళందర్నీ వీధివరకూ సాగనంపుతూ "రేపే ఫెయిర్ చేసి పంపించేస్తా"అంటాడు."ఓ! తప్పకుండా. సాధ్యమైనంత త్వరలో పంపించు"అంటూ అంతా ముక్త కంఠంతో అని తలా ఒకదారిని వెళ్ళిపోతారు.

ఇది తరచుగా జరిగే తతంగమే!

ఒకరోజు సుబ్బారాయుడు ఏదో పత్రిక చూస్తూ అందులో తెలిసిన ఒకతని కథ పడడంచూసి 'వీడూ కథరాశాడూ' అనుకుంటూ కసికొద్దీ ఆరోజు రాత్రి పదయినా భోజనానికి లేవకుండా కూర్చుని, రెండు సిగరెట్టు పెట్టెలు ఖాళీచేసి మొత్తానికి ఒకథ పూర్తిచేశాడు. దాన్ని యధావిధిగా ఆ మర్నాడు మిత్రులందరికీ చదివి వినిపించాడు. వాళ్ళ అభిమతంతో ఆరోజే ఫెయిర్‌చేసి ఏపత్రికకైనా పంపించుదామని ఆవీధిలోని పోస్టాఫీసుకి వెళ్ళాడు. స్టాంపులు కొని అంటిస్తుండగా కవర్లు అమ్మే అమ్మాయి ఎగాదిగా చూసి "కథ ఏమిటండీ?"అంది.

సుబ్బారాయుడు ఆమెతో అంతకు ముందెప్పుడూ మాట్లాడకపోయినా ఆ విధిలోనే ఆమె పనిచేస్తోంది గనుక, అనేకమార్లు ఆమెను చూశాడు. ఎప్పుడైనా కార్డులవీ కొనడానికి వస్తే, అవి అడిగి డబ్బిచ్చి తీసుకొని వెళ్ళిపోవడం తప్పించి మరేమీ మాట్లాడేవాడుకాదు. ఎప్పుడైనా కల్పించుకుని మాట్లాడుదామన్నా ఆ ఎదురుగా నామాల ఆచారి గారొకరు గండు పిల్లిలా కూచునేవారు.అందువల్ల ఆమెతో మాటకలపడానికి వీలుండేదికాదు. తరచుగా అతను తన కథల్ని అక్కడే పోస్టుచేస్తుంటాడు. అతను

కవర్లమీద పత్రికల అడ్రసులు రాయటం ఆమె చూస్తునేవుంటుంది. అసలు ఆ పోస్టాఫీసుకు ఒక పోస్టుమాస్టరు, కార్డులు స్టాంపులవీ యివ్వడానికి ఆవిడ-ఆ యిద్దరే వున్నారు. ఆరోజున ఆ నామాల పోస్టుమాస్టారు అర్జెంటు పనివుండి స్టేషనుకు వెళ్ళడంతో ఆ పోస్టాఫీసులో ఆమె ఒక్కర్తే వుంది.

ఆవిడ 'కథేమిటండీ' అని అనేసరికి కించిత్ గర్వంతో అతను 'ఊ' అన్నాడు.

"మీరు కథలు రాస్తుంటారా?" అంది కళ్ళుకాస్తా పెద్దవి చేసి.

"అదేమిటి, మీకు తెలిదా! ఎప్పుడూ నేను పత్రికలకు యిక్కడనుంచేకదా పోస్టు చేస్తుంటాను" అన్నాడు సుబ్బారాయుడు.

ఆమె సన్నగా చిరునవ్వు నవ్వింది. 'మీరు కథలు రాస్తే మా అందరికీ తెలియాలా?' అన్నట్టుగా వున్నా అది అతనికి అర్థంకాలేదు.

"నేను యించుమించు అన్ని పత్రికలూ చదువుతుంటాలెండి. అయితే మీరు ఏపేరుతో రాస్తుంటారు?" అంటూ అడిగిందామె.

"ఒకటేమిటి, మొదట్లో రెండు మూడు 'పెన్‌నేమ్' లు పెట్టి రాసేవాడిని.ఇప్పుడు మాత్రం నాపేరును కుదించి 'అసురా' అనే పేరుతో రాస్తున్నాను" ఒక పెద్ద అబద్ధం ఆడాడు సుబ్బారాయుడు. లేకపోతే, ఒక్క కథా పడలేదని చెబితే యింకేమయినావుందా! తన పరువుకాస్తాపోదూ. ఆమె ఎంతో ముచ్చటపడి అడుగుతుంటే నిజంచెప్పి ఎందుకామెను బాధపెట్టడం? అందుకే చక్కగా ఓ అబద్ధం ఆమె నమ్మేట్టుగా ఆడాడు. అడి, అట్టే ఆలస్యంచేస్తే ఆ పేరులన్నీ ఎక్కడ అడుగుతుందోనని పావుగంటసేపు పత్రికల గురించీ, వాటికి సంబంధించిన మనుషుల గురించీ ఒక ఉపన్యాసం యిచ్చాడు. ఆమెకుకూడా అవంటే యిష్టంగనుక, పాపం ఓపికతో అవన్నీ ఆలకించి 'అబ్బో' అనుకుంది మనసులో-ఆయన చాలపెద్ద రచయితే అయివుండాలనుకుంటూ.

"మళ్ళీ ఎప్పుడన్నా వీలుచూసుకుని కలుస్తాలెండి" అని వెళ్ళిపోయాడు సుబ్బారాయుడు. వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ 'ఇంకా నయం ఆ కథలపేర్లూ, ఎందులో పడ్డాయో, ఎప్పుడు పడ్డాయో యివన్నీ అడగలేదు' అనుకున్నాడు.

ఆ తర్వాత రాయుడు ఆమెను నెలరోజులవరకూ కలునుకోలేదు. కలుద్దామనుకుంటే పరీక్షలొకటి అడ్డువచ్చాయి. తీరా అయిపోయాక వెళదామనుకొంటే అకస్మాత్తుగా ప్రయాణం ఒకటి తగిలింది. ఊరునుండి వచ్చిన మర్నాడూ, ఆ తర్వాత

రోజు-ఆ వారంరోజులూ- పోస్టాఫీసు చుట్టూ తిరిగాడు, ఎప్పుడన్నా ఆమె వంటరిగా కనిపిస్తుందేమోనని.

ఎప్పుడు వెళ్ళినా ఆ నామాల ఆచారిగారు యముడిలా ఎదురుగ్గా ప్రత్యక్షమయ్యేవారు. ఆయనకు ఓ దురలవాటు వుంది. లోపలికి వచ్చిన ప్రతిమనిషిని- ముఖ్యంగా వయసులోవున్నవాళ్ళని-పట్టిపట్టి మరీ చోద్యంగా చూస్తుంటారు. ఆవులిస్తే పేగులు లెక్కపెట్టేరకం. తనని బాగా ఎరిగిన మనిషి. ఆచారిగారు వుంటుండగా ఆమెతో మాట్లాడ్డం కుదర్దు. ఎలామరి?-అని ఆలోచించాడు.

ఒకరోజు సాయంకాలం ఆమె యింటికి వెళ్ళిపోతున్నప్పుడు బస్‌స్టాపు దగ్గర కలుసుకుని పలకరించాడు. వెంటనే ఆమె అడిగేసింది. "కథలేమన్నా పడ్డాయా?" అని.

"ఏదీ, అయిదు వారాలేగా అయ్యింది. బహుశా వచ్చేవారం పడుతుందనుకుంటా" అన్నాడు.

"ఈమధ్య మళ్ళీ ఏమన్నా రాశారా?" ఆమె అడిగింది.

"మొన్ననే రెండు కథలు రాశాను. మీకు చదివి వినిపిద్దామనుకుంటే ఆ కర్కోటకుడు ఆచారిగారు అడ్డుకదా"

"పోనిస్తురూ, ఆయన్ని తిడతారెందుకు? అచ్చయితే నే చూస్తాగా. ఎందులోనయినా పడితే నాతో చెప్పండి" అంటూ బస్సు ఎక్కి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిపోతుంటే జ్ఞాపకానికొచ్చింది, తనూ ఆ బస్సులోనే ఆమెకూడా కొంతవరకూ వెళ్తే బావుండేదికదాని. అక్కడికీ బస్సు ఆపమని ఆ వెనకాలే చప్పట్లు కొట్టి పరుగెత్తాడు! ఇంకానయం, పరుగెడుతుంటే రాయి తగిలి తూలిపోయి పడబోయి తమాయించుకున్నాడు. ఒక పిల్లమాత్రం చూసి పకపకానవ్వింది. 'హూ' అనుకుంటూ చరచరా వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత పోస్టాఫీసుకు నాలుగైదుసార్లు వెళ్ళి అవసరంలేకపోయినా ఉత్తరాలు కొనుక్కుని, పోతూపోతూ ఆచారిగారు చూడకుండా, యింకొకరికి కనిపించకుండా చాటుగా నవ్వి చకచకా బయటికి వచ్చేవాడు.

ఒకరోజు స్టాంపులు కొనుక్కొని వెళ్ళిపోతున్న సుబ్బారాయుడ్ని చూసి తనలోతనే నవ్వుకున్నారు ఆచారిగారు.

"వీడికింకా ఆ పిచ్చి వదల్లేనట్టుంది. ఇంతకాలం నించి రాస్తున్నాడా, ఒకటయినా అచ్చయితేగా " అన్నారు ఆచారిగారు.

"అదేమిటండీ నెలకో కథయినా యిక్కడ్నుంచి పోస్టు చేస్తుంటారు. ఏవో పెన్‌నేమ్‌లు పెట్టిరాసిన కథలు అచ్చయినవి చాలానే వున్నట్టు చెప్పారు. అదీకాక చాలా మంది ఆయన్ని కవిగారూ అని పిలుస్తూండగా విన్నాను" అంది ఆమె ఆశ్చర్యపోతూ.

"ఏడిశాడు. అందరి ముందూ అలా గొప్పలు చెప్పుకుంటాడులే. ఆ మధ్య మావాడూ నాలుగు మాటలు అల్లి కథరాసి వాడివెంట తిరుగుతుంటుంటే గట్టిగా కోప్పడ్డాను" అన్నారాయన.

'భలేగా నమ్మించి మోసగించాడే!' అనుకుంది ఆమె. దీనికి తగిన బుద్ధి చెప్పాలనుకుంది. 'సరే, యీమాటు కనిపిస్తే చెప్తాగా' అని లోలోపలే ఓ నిర్ణయానికి వచ్చింది.

ఆ మర్నాడు సాయంత్రం పోస్టాఫీసు పని పూర్తికాగానే బస్‌స్టాపుకు వెళ్తుంటే సుబ్బారాయుడు మిత్రులతో వస్తూ కనిపించాడు. రాయుడ్ని ఓరగా చూసి చిన్న చిర్నవ్వు నవ్వి దాటిపోయింది ఆమె.

"అసలు విషయం ఏమిటోయ్?" అన్నారు అంతా ఒక్కసారిగా.

సుబ్బారాయుడు సంగతంతా చెప్పి "ఆమె నన్ను ప్రేమిస్తోందిలే" అన్నాడు.

"అదృష్టవంతుడివే. ఇంతకూ పేరేమిటో చెప్పావుకాదు" ఒక కవిమిత్రుడు జలసీతో గొణిగాడు.

"మొన్ననే చెప్పిందిలే, కమలట"

"భేషుగ్గావుంది. అయినా నిన్ను ప్రేమించక పోవడమేమిటి-కథారచయితవు" హుషారుగా వీపు చరిచాడు మరో మిత్రుడు.

ఇంకోమిత్రుడు పక్కనున్న హోటలు చూపించి "దీనికేకదూ మొన్న ప్రొప్రయిటరు మారాడు" అన్నాడు.

ప్రొప్రయటరు మారడానికీ, అప్పటి విషయానికీ సంబంధంలేకపోయినా, ఆ మాటలకు అంతరార్థం హోటలుకు వెళ్దామన్నది గుర్తించి "అయితే ఫలహారాలు ఎలా వున్నాయో చూద్దాం రండి" అంటూ నలుగుర్నీ వెంటబెట్టుకొని లోపలికి అడుగుపెట్టాడు

సుబ్బారాయుడు. అక్కడ పేరుపేరునా అడిగి టిఫిన్లు తెప్పించి యిచ్చి, కాఫీకూడా తాగించి బిల్లుచెల్లించేసి బైటికి రాగానే తలా ఒకవిధంగా దీవించి, చిన్న వాళ్ళు పొగడ్తల్ని కురిపించి, అతనికూడా యింటివరకూ వెళ్ళి, అక్కడ్నుంచి ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

వెళ్ళేముందు మధ్యదారిలో, ముందుముందు మెలగవలసిన రీతిరివాజుల్ని గురించి అనుభవంవున్న ఒకరిద్దరు మిత్రులు బోధించారు. సుబ్బారాయుడికి యింటికి వచ్చిన తర్వాత ఆ రోజు యిక భోజనం చెయ్యాలనిపించలేదు. మనసంతా సంతోషంతో నిండిపోయింది. రాత్రంతా చిత్రవిచిత్రమైన కలలే వచ్చాయి.

ఒకరోజు సుబ్బారాయుడు పోస్టాఫీసుకొచ్చి కవర్లుకొంటూ, ఆమె యిస్తున్నప్పుడు జేబులోనుండి జాగ్రత్తగా కవరొకటి తీసి మరొకరి కంటబడకుండా లోపలికి విసిరి, ఆమె యిచ్చినవి అందుకుని చిన్నగా నవ్వి వెళ్ళిపోయాడు.

ఆమె కిందపడ్డ కవరుతీసి జాగ్రత్తగా దాచింది. ఆచార్లుగారు లేనప్పుడు విప్పి సావకాశంగా చదువుకొంది. అది చదువుతున్నంతసేపూ ఆమెకు నవ్వాగిందికాదు. ఓ పెద్ద చేటభారతమంత ప్రేమలేఖ రాశాడు. అందులో మొదటినుండి చివరివరకూ ఆమెను గురించిన పొగడ్తే. ఆమె ముఖాన్ని, జుత్తుని, కళ్ళని, ఒంటిని పెద్దపెద్ద సమాసాల్తో, మధ్య మధ్య కవిత్వంకూడా వచ్చునన్నట్టు అలంకారాల్తో, సుదీర్ఘమైన సంస్కృతపదాల చేంతాడు వాక్యాలతో వర్ణించాడు.

నల్లరంగంటే సామాన్యం కాదట! శ్రీకృష్ణుడు, శ్రీరాముడు లాంటి మహాపురుషులంతా నల్లగానే వుంటారట! నల్ల కలువలు సాధారణంగా ఎక్కడో కానివుండవట! నల్లచేవకర్ర పటిష్టతకు, నిగనిగలాడేనునుపుదనానికి చిహ్నమట. ఇంకా ఏమేమో...చూస్తే నవ్వొచ్చేవీ, ఒకదానితో ఒకటి సంబంధంలేనివీ చాలా చాలా విషయాలు రాశాడు.

చదివిన ఉత్తరాన్నే మళ్ళీ మరొక్కమారు చదివి లోలోపలే నవ్వుకుంటూ,అప్పుడే ఆచారిగారు లోపలికి రావడం చూసి జాగ్రత్తగా దాన్ని దాచిపెట్టింది-ఏడిపించడానికి మహబాగా చిక్కావులే అనుకుంటూ.

ఆ రాత్రి యింటి దగ్గర బాగా ఆలోచించి ముచ్చటగా మూడే మూడు లైనులు- చూస్తే దాసోహం అని కాళ్ళమీద పడేటంత ప్రేమను ఒలకబోసి ఉత్తరం రాసి కనిపించినప్పుడు యిద్దాంలే అని తనదగ్గరే దాచిపెట్టుకుంది.

జవాబు గురించని పనిగట్టుకొని మూడో రోజు వచ్చాడు సుబ్బారాయుడు. ఆమె యిచ్చిన కవరందుకుని తను తెచ్చినది ఆమెకిచ్చి, ఆచారిగారికి అనుమానం కలక్కుండా వుండేందుకై కొన్ని కార్డులు కొనుక్కుని వెళ్ళిపోయాడు.

పోస్టాఫీసు మెట్లుదిగి, వెనకనించి ఎవరో పిలుస్తున్నా వినిపించుకోకుండా పెద్ద పెద్ద అంగలేసుకుంటూ గబగబా యింటికి వెళ్ళి ఉత్తరం విప్పి చదువుకున్నాడు. చదివిన తర్వాత హుషారుగా ఒకమారు చిటికవేశాడు. మరోమారు ఈలవేశాడు. ఇంకోమారు లోలోపలే నవ్వుకున్నాడు. గదిచుట్టూ ఆకాగితం ముక్కపట్టుకుని తిరిగాడు.

అప్పుడే గదిలోకి ప్రవేశించిన మిత్రచతుష్టయంలో మూడవవాడు మధుసూదనం సుబ్బారావు చేస్తుండే క్రియలకు కారణం ఏమిటో తెలీక "కథ ఏమన్నా అచ్చయిందేమిటి?" అన్నాడు.

కాదన్నట్టుగా తల అడ్డంగా తిప్పి వూరుకున్నాడు రాయుడు-అవతలివాడిచేత అరడజను సార్లయినా ఆ విషయం గురించి అడిగించుకోనిదే ఏమీ చెప్పగూడదను కొన్నాడు.

"మరేమిటి; పిలుస్తుంటే అంతకంగారుగా కొంపమునిగిపోయినట్టు పరుగెత్తు కొంటూ వచ్చావ్?" అడిగాడు మధుసూదనం-అప్పటికీ సుబ్బారాయుడు ఏమీ చెప్పకపోతే 'పోనీ, చెప్పగూడనిదేమో' అనుకుని మాట్లాడకూరుకున్నాడు.

సుబ్బారాయుడికి మిత్రుడి మౌనం కాస్త నిరుత్సాహాన్ని కలిగించింది. వాడేదో తనను చెప్పమని ప్రాధేయపడతాడని, తను ముందు బిగిసి ఆతర్వాత సడలి మెల్లగా ఊరించి ఊరించి అసలు సంగతి చెప్దామనుకుంటే మాట్లాడకుండా కూర్చుని కథ అడ్డం తిప్పాడేమిటి మధుసూదనం?!

విధిలేక తనే కల్పించుకుని ఆ సంగతంతా మధుసూదనానికి చెప్పి, ఉత్తరంకూడా చూపించాడు సుబ్బారాయుడు.

మధుసూదనం ఉత్తరంచదివి, మిత్రుడిభుజం చరిచి "ఆ రోజున అంతమంది అభినందిస్తే దాని ఫలితం ఊరికనే పోతుందా" అన్నాడు.

అతనే ఆ తర్వాత ఆ విషయం మిగిలిన ముగ్గురికీ చేరవేశాడు. అంతా సుబ్బారాయుడ్ని అభినందించి మళ్ళీ ఓమారు హోటలుకు నడిపించారు. మధ్యదారిలో, నడుచుకోవలసిన రీతులన్నీ తలకెక్కించారు.

మిత్రుల సలహాలను పాటిస్తూ రెండు నెలల్లోనూ చాలా ప్రేమలేఖలు రాసి, తిరుగులేఖలుకూడా పొందుతుండేవాడు సుబ్బారాయుడు. ఆ వచ్చిన ఉత్తరాలూ, తను పంపినవాటి నకళ్ళూ జాగ్రత్తగా పెట్టెలో అడుగున పుస్తకాలమధ్య దాస్తుండేవాడు.

ఒకరోజు మామూలుగా ప్రేమలేఖ అందిద్దామని పోస్టాఫీసుకి వెళ్ళాడు సుబ్బారాయుడు.

రాయుడ్నీ చూడ్డంతోనే "కొత్త పత్రిక వచ్చింది. మీరు పంపిన మూడు కథల్లోనూ ఒకటీ కనిపించదేమండీ" అంది ఆమె.

సుబ్బారాయుడు గతుక్కుమన్నాడు. "వెధవలు ఏదో మిశ్చిఫ్ చేసారు" అన్నాడు గొణుక్కున్నట్టుగా.

"ఇదిగో చూడండి కొత్త పత్రిక. దీన్లో నా కథ వేసారు" అంది ఆమె పుస్తకం అందిస్తూ.

కొద్దిక్షణాలు నిశ్చేష్టుడై నిలబడిపోయాడు సుబ్బారాయుడు. ఆ తర్వాత "ఏమిటి! మీరు వ్రాసిందే!" అన్నాడు ఆశ్చర్యపోతూ. గబగబా పేజీలు తిరగేశాడు.

ముందు హెడ్డింగూ, తర్వాత రచయిత్రిపేరూ, చూశాడు. కథపేరు- ఉత్తరాల ఉదంతం'. రచయిత్రిపేరు-అదే!..కమల!

కథ చదవబోతుండగా కళ్ళు మసకలు కమ్మితే ఓమారు కళ్ళు నులుముకుని చదవడం ప్రారంభించాడు. సగం చదివేసరికి అతని ముఖంలో రంగులు మారుతుంటే సరదాగా చూస్తూ అతనికి కనిపించకుండా నవ్వుకుంటూ కూర్చుంది ఆమె.

కార్డులు కొందామని పోస్టాఫీసుకి వచ్చిన మధుసూదనం, సంగతేమిటో చూద్దామని పుస్తకంలోకి వంగి చూశాడు.

అదే...! కథ అంతా ఉత్తరాల రూపంలో వుంది. ఆ ఉత్తరాలన్నీ సుబ్బారాయుడు ఆమెకు రాసినవీ, ఆమె అతనికి రాసినవీనూ. అతని ఉత్తరాలకు ఆవిడ జవాబుల్ని జతచేర్చి ఆమె పేరుతో ప్రచురించుకొంది!

అక్కడ తను ఏమన్నా ఆచారిగారికి తన సంగతి తెలిసిపోతుందేమోనని మారు మాట్లాడకుండా, మిత్రుడు చెయ్యూతనిస్తే తల తిరక్కుండా పట్టుకుని, ఫకాలుమని నవ్వుకొంటున్న ఆమె వైపయినా చూడకుండా గబగబా పోస్టాఫీసు మెట్లుదిగి వీధిలోకి జారుకున్నాడు సుబ్బారాయుడు.